# యాక్సిడెంట్

-వాణిశ్రీ

నల్లత్రాచులా నిగ నిగ లాడుతున్న తారు రోడ్డు మీద మారుతీ ఎస్టీమ్ తెరచాపలేని పడవలా తేలిపోతోంది. కారు హెడ్ లైట్లు లేజర్ కిరణాలలా దూసుకుపోతున్నాయి.

వెనుక సీట్లో కూర్చున్న సుకన్య కళ్ళల్లో మెదులుతూ గుండెలో అలజడి రేపుతూ వుంటే రెట్టించిన వుత్సాహంతో డ్రైవ్ చేస్తున్నాడు కన్నయ్య. అప్సరసలను మించిన అందగత్తె గుండెల మీద తలవాల్చి తమకంగా ఆమెను చుట్టుకున్న రమేష్ అదృష్టానికి అతని కడుపులో మంట రగుల్చుతోంది.

కన్నయ్య ఆమెను తొలిసారిగా చూసింది గంట క్రితమే. రమేష్‌బాబు కారు డ్రైవర్ ప్రభు ఆ రోజు పొద్దున్నే వచ్చి నిద్ర లేపాడు.

''అరేయ్! కన్నయ్యా! కొంచెం సాయం చెయ్యాల్రా!'' అన్నాడు.

''పైసా లేదు నా దగ్గర. నువ్వేం ఆశ పెట్టుకోకు.'' కటువుగా అన్నాడు కన్నయ్య.

''డబ్బు గురించి కాదురా!''

''మరేంటి?''

''సాయంకాలం బాబుగారు వూరెళ్తున్నారు. మీ చెల్లెలికి పురుడొచ్చే రోజులు. నేను వూరు వదిలి పెట్టడానికి లేదు. మా కారు తోలడానికి రావాలి నువ్వు.'' బతిమాలాడు ప్రభు.

''రాత్రి రెండింటికి డూటీ దిగాను. పది రోజులైంది వూరొదిలి. పొద్దున్నే వచ్చి తగులుకున్నావు. ఈ రోజు నా వల్లకాదు. రేపు చూద్దాం.'' విసుగ్గా అన్నాడు కన్నయ్య.

''బాబ్బాబు అర్జెంటుగా వెళ్ళాలి. అయ్యగారు మొన్ననగా చెప్పారు. వూరెళ్ళాలి మంచి డ్రైవర్‌ని చూడమని. చీకటి పడితే సారా కొట్టే నా కొడుకులే గాని సరైనోడు ఒక్కడూ దొరకలేదు. నువ్వు కాదంటే కుదరదు. ఎంతా? రెండు రోజులే! అమ్మగారింటికి అర్జెంటుగా వెళ్లాలంట. ఇలా వెళ్లి అలా రావడమే! ఇయ్యాల్లో రేపో నీకు అల్లుడో, కోడలో పుడతారు. మిలట్రీ రమ్ము రెడీ చేసి వుంచాను.'' ప్రభు నోరూరించాడు.

కన్నయ్య ''సరే'' అనక తప్పలేదు.

అలా ప్రభు వెంట వెళ్ళిన కన్నయ్య, సుకన్యను మొదటిసారిగా చూశాడు.

కన్నయ్య కళ్ళముందు మెరుపులు మెరిశాయి. రెప్పలు కొట్టడం మర్చిపోయి నోరు తెరుచుకుని విశ్వరూపాన్ని చూస్తున్న భక్తుడిలా పులకించి పోయాడు.


సుకన్య వరండామెట్లు దిగి వయ్యారంగా అడుగులు వేస్తూ కారు వైపు వస్తుంటే, ఆమె కాళ్ళు తన గుండెల మీదే పడుతున్నట్లుగా వుక్కిరి బిక్కిరై పోయాడు.

నిజ జీవితంలో అంత సమ్మోహనకరమైన రూపవతిని వీక్షించడం అదే ప్రథమం. పసిడి మేని కాంతితో ఆమె బంగారు బొమ్మ ప్రాణం పోసుకుని నడిచి వస్తున్నట్లు అనుభూతి కలిగింది.

ఆమె ఎత్తు, దానికి తగిన శరీర సౌష్టవం, అమావాస్యనాడు ఆకాశంలో మెరిసే నక్షత్రాల్లాంటి కళ్ళు, పోనీటైల్‌లో నల్లటి మేఘశకలంలా కదులుతున్న జుట్టు, యవ్వన భారంతో కదులుతున్న గుండెలు చూసి డంగైపోయాడు కన్నయ్య. కారులో ఎక్కుతున్నప్పుడు ఆమె నడుం వంపు చూసి పిచ్చెక్కిపోయిందతనికి.

రక్త ప్రసరణ వేగం హెచ్చి గుండె దడ దడ లాడింది. నర నరమూ వణికి పోతోంది. నిప్పుల్లో పడిన వాడిలా విల విల లాడాడు. కాళ్ళు తేలిపోయి, మెదడు మొద్దుబారి పోయింది.

''ఇక బయల్దేరదామా?'' అన్న రమేష్ మాటలతో ఈ లోకంలోకి వచ్చాడు.



ముప్పై ఏళ్ళు ముంచుకొస్తున్న కన్నయ్యకు లెక్క లేనన్ని సంబంధాలు వస్తున్నాయి, పెళ్ళి చేసుకోమని ముసలి తల్లి పోరుపెడుతున్నది కాని ఒక పిల్ల కూడా సుకన్యలో పదోవంతు అందగత్తె కాదు.

అందం చందం లేని దానితో జీవితాంతం గడిపినా ఏం లాభం? సుకన్య లాంటి అందాల రాణితో ఒక పూట సుఖించినా చాలు జన్మ ధన్యమైపోతుంది. ఆ అనుభవాల జ్ఞాపకాలతో వందేళ్ళు ఈజీగా గడియపెయ్యవచ్చు.

కన్నయ్యలోని శృంగార పురుషుడు విజృంభించి వూహల్లో తేలిపోతున్నాడు.

ట్రాఫిక్‌లేని రోడ్డు కాబట్టి ఆకాశంలోకి వదిలిన రాకెట్‌లా దూసుకు పోతోంది కారు.

''కన్నయ్యా కారాపు.'' అన్నాడు రమేష్.

కన్నయ్య రోడ్డు పక్కన కారు ఆపాడు.

''ఏం కావాలి సార్?'' అన్నాడు తల వెనక్కి తిప్పి.

''టీ తాగి వెళ్దాం'' అన్నాడు.

కన్నయ్య కారు దిగాడు.

రమేష్ దిగబోతూ వుంటే ''మీరెందుకుసార్! నేను పంపిస్తాను. మీరు కూర్చోండి'' అన్నాడు కన్నయ్య.

కారు దిగబోతున్న రమేష్ ఆగిపోయాడు. పర్సులో నుంచి డబ్బు తీస్తుంటే '' నా దగ్గరున్నాయి సార్!'' అంటూ తాటాకులపాక హోటల్ వైపు వెళ్ళాడు కన్నయ్య.

హోటల్ కుర్రాడు రెండు కప్పుల్లో టీ తెచ్చి ఇచ్చాడు.

కన్నయ్య టీ తాగి కారు దగ్గరికి వచ్చేసరికి డ్రైవింగ్ సీట్లో కూర్చొని వున్నాడు రమేష్.

''సార్! మీరు.....'' ఆశ్చర్యంగా అన్నాడు కన్నయ్య.

''ఇప్పటి వరకూ నువ్వు డ్రైవ్ చేశావుగా! నేను కాసేపు

డ్రైవ్ చేస్తాను.'' అన్నాడు రమేష్ నవ్వుతూ.

కన్నయ్య అటువైపు వెళ్ళి డోరు తెరుచుకుని రమేష్ పక్క సీట్లో కూర్చున్నాడు.

''ఏమండీ! మీకెందుకీ డ్రైవింగ్?



మావయ్య గారికి తెలిస్తే కోప్పడతారు. బయల్దేరేటప్పుడు నాకు చెప్పారు గూడా మీరు డ్రైవింగ్ చెయ్యకుండా చూడమని. అసలే మీకు లైసెన్స్ గూడా లేదు.'' ఆందోళనగా అన్నది సుకన్య.

''డోంట్ వర్రీ! ఆయనొక చాదస్తుడు. కార్లున్నాక ఎంత డ్రైవర్లున్నా డ్రైవింగ్ నేర్చుకోవద్దా! అవసరం వస్తుంది. ఇరవై నాలుగు గంటలూ డ్రైవర్ అందుబాటులో వుంటాడా? ఎంత చెప్పినా వినడు. ఎందుకొచ్చిన రిస్కు అంటాడు. ఆయన డ్రైవింగ్ నేర్చుకోలేదు. నన్నూ వద్దంటాడు.'' అన్నాడు రమేష్.

''అయినా మీరాయన మాట విన్నారా? ఎట్లాగో నేర్చుకున్నారుగా?'' అన్నది సుకన్య.

''ఏం లాభం? కారు ముట్టుకోనియ్యడు. డ్రైవర్ రాకపోతే కారుని షెడ్డులో పడుకోబెడతాడు. ఏదో అడపా దడపా ఇట్లా సరదా తీర్చుకుంటాను.'' అన్నాడు రమేష్.

సన్నగా మొదలైంది వాన.

కన్నయ్య డోర్ పైకెత్తి కూర్చున్నాడు.

అయినా చల్లటిగాలి వణికిస్తున్నది. మఫ్లర్ చుట్టుకుని కూర్చున్నాడు.

వర్షం ఉధృతి పెరిగింది.

ఉరుములు మెరుపులతో ఆకాశం అల్లకల్లోలంగా వుంది.

ఘాట్ రోడ్డు నిర్మానుష్యంగా వుంది. నేషనల్ హైవే కాకపోవడం వల్ల ట్రాఫిక్ లేదు. అప్పుడొక కారు, లారీ ఎదురొస్తున్నాయి. రమేష్ ఒంటి చేత్తో దర్జాగా డ్రైవింగ్ చేస్తున్నాడు.

శరీరాన్ని వణికిస్తున్న ఈ చలిగాలిలో, వర్షపు జల్లులు గిలిగింతలు పెడుతుంటే నెమ్మదిగా రెండు, మూడు పెగ్గులు రమ్ముకొట్టి, ఆనక సుకన్య లాంటి అందాల దేవత పక్కలోకొస్తే నాసామిరంగా అంతకంటే స్వర్గం ఏవుంటుంది? అత్తగారింటి కెళ్ళాక రమేష్ బాబు చేసే పని అదే. ఏం అదృష్టం ఏమదురుష్టం?

ఛీ...తనూ వున్నాడు? ఏం లాభం? వెధవ జన్మ.

రమేష్ అదృష్టానికి ఈర్ష్య పడుతూ, తన దురదృష్టానికి దిగులుపడుతూ కూర్చున్నాడు కన్నయ్య.

ముట్టుకుంటే మాసిపోయే పాలరాతి బొమ్మలాంటి ఆడోళ్ళు నూటికో కోటికో ఒకరుంటారనుకుంటా! లేకపోతే తను ఎన్నడూ ఇంత అందగత్తెను చూడకుండా వుండడు. అయినా పెద్ద పెద్ద అంతఃపురాల లాంటి బిల్డింగుల్లో రాజకుమారిల్లాంటోళ్ళు తన కంట ఎట్లా పడతారు?

కట్నం గిట్నం లేకపోయినా, తను ఎదురు డబ్బు యిచ్చి అయినా, కులం గోత్రం కాకపోయినా సరే, సుకన్య లాంటి అందగత్తెను పెళ్ళి చేసుకోవాలి.

కన్నయ్య మనసులో నుంచి సుకన్య ఆలోచనలు తొలగడం లేదు. ఆమె పర్సనాల్టీ, వంపు సొంపులు, సోయగాలు అతన్ని అంతగా ప్రభావితం చేశాయి.

తను తెలివి తక్కువ ఆలోచనలు చేస్తున్నాడని తెలిసినా అవే అతని హృదయానికి గిలిగింతలు పెట్టి, మనసుని మత్తులో ముంచుతున్నాయి.

ఎప్పుడు కళ్ళు మూశాడో తెలియదు. నిద్రలోకి జారిపోయాడు.

భయంకరమైన శబ్దంతోపాటు తను ఎక్కడికో విసిరివేయబడి నట్లనిపించింది. కన్నయ్య కళ్ళు తెరిచే లోపల తెలివి తప్పిపోయాడు.

కారుకి యాక్సిడెంటయింది.

★★★

సుకన్య కళ్ళు తెరిచింది.

సీలింగ్ ఫ్యాన్ నెమ్మదిగా తిరుగుతూ కనిపించింది.

కళ్ళు అటూ ఇటూ తిప్పింది. తనొక గదిలో మంచం మీద వుంది. తనకు మెడ వరకు దుప్పటి కప్పివుంది.

ఎదురుగా తెల్లటి బట్టల్లో ఒక ముసలాయన నవ్వు ముఖంతో కన్పించాడు.

సుకన్య దిగ్గున లేచి కూర్చుంది.

''మీరు....?'' అన్నది ఆశ్చర్యంగా చూస్తూ.

''పేరు డాక్టర్ మిత్ర. ఎలా వుందమ్మా ఇప్పుడు?''

''డాక్టర్ ఏమైంది నాకు?''

''నీకేం కాలేదమ్మా! మీ కారుకి యాక్సిడెంట య్యింది. ఇది ఎర్రపాలెం అనే వూరు. ఈ వూరి వాళ్ళు కొందరు చూసి మిమ్మల్ని మా ఇంటికి తీసు కొచ్చారు. అదృష్టవశాత్తు నీకేం కాలే దమ్మా! షాక్‌తో తెలివి తప్పిపోయావు. అంతే.'' అన్నాడు డాక్టర్.

సుకన్య అయోమయంగా చూసింది.

''డాక్టర్ ఆయన ఏరి?''

''పక్క గదిలో వున్నారమ్మా! ఆయనకి స్టీరింగ్ వీల్

తగిలి కాస్త ఎక్కువ దెబ్బలు తగిలాయి.''

''డ్రైవర్ ఆయనకేం కాలేదు గదా!''

''ప్రాణాపాయం ఏం లేదమ్మా! పక్కటెముకలు విరిగాయి. కొన్నాళ్ళ పాటు కదలగూడదు. తర్వాత కోలు కుంటాడు.''

సుకన్య నెమ్మదిగా లేచి నిల్చుంది.

డ్కాక్టర్ మిత్ర ఆమెను రమేష్‌ని వుంచిన గదిలోకి తీసుకెళ్ళాడు. అతనికి బాగా దెబ్బలు తగిలాయి. తలకి గూడా కట్టుకట్టి వుంది. నిద్రపోతున్నాడో, తెలివి తప్పిపడి వున్నాడో ఆమెకు అర్థం కాలేదు. రమేష్‌ని ఆ పరిస్థితిలో చూసి ఆమెకు దుఃఖం ముంచుకొచ్చింది.




''డోంట్ వర్రీ! అతనికేం అపాయం లేదు. డ్రైవింగ్ సీట్లో కూర్చొని వుండడం వల్ల బాగా దెబ్బలు తగిలాయి. అంతే.''

డ్కాక్టర్ ప్రోద్బలంతో ఆమె ముఖం కడుక్కుని కాఫీ తాగింది.

''డ్కాక్టర్ ఇది మీ నర్సింగ్ హోమా?'' అడిగింది సుకన్య.

''లేదమ్మా! ఇది నా ఇల్లు. నా భార్య మా అమ్మాయిని చూడ్డానికి బెంగుళూరు వెళ్ళింది. నా కొడుకు లిద్దరూ డ్కాక్టర్లే. స్టేట్స్ వెళ్ళారు. నేను రిటైరైపోయి ఇక్కడ సెటిలయ్యాను. ప్రాక్టీసేం చెయ్యడం లేదు. అవసరమైన వారికి వైద్యం చేస్తుంటాను. ఊరి చివర పళ్ళతోటలు పెంచుతున్నాను. నాకు రోజంతా కాలక్షేపం అక్కడే.''

డ్కాక్టర్ మిత్ర తన గురించి చెప్పు కొచ్చాడు.

పనిమనిషి రాజమ్మ టిఫిన్ పట్టు కొచ్చింది. స్నానం చేసి టిఫిన్ తీసుకున్నాక బెడ్ మీద పడుకుంది. వళ్ళంతా నెప్పులుగా వున్నాయి. డ్కాక్టర్ ఆమెకు ఇంజెక్షన్ చేసి రెండు టాబ్లెట్లు ఇచ్చాడు. తర్వాత రెస్ట్ తీసుకోమన్నాడు. బాధ తెలియకుండా వుండడానికి రమేష్‌కి సెడెటిల్ ఇచ్చాననీ, అతన్ని డిస్టర్బ్ చెయ్యవద్దని చెప్పాడు.

''నీకో విషయం చెప్పాలమ్మా! డ్రైవర్ చెప్తేనే నాకా విషయం తెలిసింది.'' అన్నాడు డ్కాక్టర్ మిత్ర.

''ఏమిటి డ్కాక్టర్? డ్రైవర్‌కి ఏమైంది?'' అందోళనగా అన్నది.

''అతనికేం కాలేదమ్మా! బాగానే వున్నాడు. అది కాదు అసలు సంగతి. నీ హస్బెండ్ కారు డ్రైవ్ చేస్తున్నాడు. ఆ టైమ్‌లో యాక్సిడెంట్ అయింది. అతనికి డ్రైవింగ్ లైసెన్స్ లేదట గదా!''

''అవును డ్కాక్టర్. వద్దని ఎంత చెప్పినా వినలేదు. అసలు ఈ కారు ప్రయాణం మా మామగారికే మాత్రం ఇష్టం లేదు. కొడుకు డ్రైవింగ్ చేయడం ఆయనకి ఇష్టం వుండదు. బస్సులో వెళ్ళిరమ్మన్నారు. ఆయనే పట్టుబట్టి కారు తీసుకొచ్చారు.'' సుకన్యకు ఏడుపొచ్చింది.

''అదేనమ్మా! ప్రాబ్లమ్. లైసెన్స్ లేని వాడు డ్రైవింగ్ చేస్తుంటే మీకారు యాక్సిడెంట్‌కి ఇన్సూరెన్స్ డబ్బు రాదు. అందులో కారు తుక్కు-తుక్కయింది. అదృష్టవశాత్తు మీరు ప్రాణాలతో బైటపడ్డారు. ఇన్సూరెన్స్ కవర్ కాకపోతే ఎంత లేదన్నా మూడు లక్షలు నష్టమే మీకు. అదీకాక పోలీసులు కేసు పెడతారేమో? అదొక తలనెప్పి వ్యవహారం.''

డ్కాక్టర్ అదంతా చెప్తుంటే సుకన్య గుండె దడ దడ లాడింది. కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగి ఏడుపు ముంచుకొచ్చింది.


మామగారు చండశాసనుడు. తను ఆయన కోడలు కావడమే ఇష్టం లేదు. తన తండ్రి ఒకప్పుడు స్థితి పరుడు, వ్యాపారస్తుడూ అయినా కాలం కాటు వేసి ఆర్థికంగా దెబ్బతిన్నాడు. రమేష్ వాళ్ళ లెవల్‌కి తగినట్లుగా కట్న కానుకలు ఇచ్చుకునే పరిస్థితిలో లేడు. అయినా రమేష్‌కు తను నచ్చి తండ్రిని ఎదిరించి పెళ్ళి చేసుకున్నాడు. భారీగా వచ్చే కట్న కానుకలు రాకుండా పోయాయని అత్తమామలకు లోలోపల ఎంతగానో బాధగా వుంది. ఇప్పుడే యాక్సిడెంట్ జరిగి కొడుక్కి దెబ్బలు తగిలాయి. ఇక కారు తుక్కు తుక్కయింది. దానికి తోడు ఇన్సూరెన్స్ డబ్బు అందక మూడు లక్షలు నష్టపోతే ఇక చెప్పేదేముంది?

అన్నిటికీ కారణం కోడలు అడుగుపెట్టిన వేళావిశేషమేననీ, నష్టజాతకురాలనీ, ఎన్నెన్ని సూటి పోటు మాటలంటారో?

ఆమె భయంతో వణికి పోయింది. దుఃఖంతో పెదవులు అదురుతున్నాయి. ఆవేదనతో హృదయం భారమైంది.

వ్యాపారంలో వంద రూపాయలు నష్టమొచ్చే పని ఎవరు చేసినా మండిపడతాడు మామగారు. మొఖం వాచేటట్లు చీవాట్లు పెడతాడు. బి.పి. రెయిజైపోయి కేకలు పెడతాడు. అటువంటిది మూడు లక్షలు నష్టం అని తెలిస్తే ఇంకేవుంది? ఆయనకి హార్ట్ ఎటాక్ వస్తుందేమో?

## ఐశ్వర్యకు గుడ్‌బై



నిన్నా మొన్నటి వరకూ చెట్టాపట్టాలేసుకుని తిరిగిన ఐశ్వర్యారాయ్-బాబీ డియోల్ విడిపోయినట్టున్నారు. ఈమధ్య ఏ జర్నలిస్టయినా బాబీని ఐశ్వర్య గురించి ప్రశ్నిస్తే అదోలా ముఖం పెడుతున్నాడట. అలాగే ఐశ్వర్యను బాబీ గురించి అడిగినా సమాధానం దాటవేస్తోందట. మరి వీళ్లిద్దరూ విడిపోవడానికి కారణం ఏమిటా అని విచారిస్తే ఐశ్వర్య సరికొత్త స్నేహితుడు చంద్రచూడ్ సింగ్ కారణమని తెలిసింది. ఐశ్వర్యకు మరో స్నేహితుడు వుండడం ఇష్టంలేని బాబీ డియోల్ ఐశ్వర్యకు దూరమైపోయాడు. బాబీ డియోల్‌ని వదిలేసి డ్రగ్ ఎడిక్ట్ చంద్రచూడ్‌కి దగ్గరైన ఐశ్వర్య అతన్ని ఆ వ్యసనం నుంచి తప్పిస్తుందో లేక తనే అలా మారిపోతుందో కొన్ని రోజులు ఆగితేగానీ తెలీదంటున్నారు బాలీవుడ్ జనాలు.

-జె.వి.బాబు

మామగారు గుండెపోటుతో చచ్చి శవమైనట్లు, తన భర్త డ్రైవింగ్ లేకుండా కారు నడిపి యాక్సిడెంట్ చేసినందుకు కట కటాల వెనక్కి వెళ్ళినట్లు అనిపించి తుఫాన్ భీభత్సంలో కొబ్బరి చెట్టులా వణికిపోయింది.

''దీనికొక వుపాయ ముందమ్మా!'' అన్నాడు డ్కాక్టర్ మిత్ర.

ఆమెకు పోతున్న ప్రాణం లేచి వచ్చింది.

''ఏమిటి డ్కాక్టర్.''

''యాక్సిడెంట్ నీ భర్త చెయ్యలేదు. అసలు నీ భర్త కారు డ్రైవ్ చెయ్యలేదు. డ్రైవర్ కారు డ్రైవ్ చేస్తున్నాడు. అతనే యాక్సిడెంట్ చేశాడు.'' చెప్పాడు మిత్ర.

''కారు డ్రైవర్ అందుకు ఒప్పుకుం టాడా?''

''డబ్బిస్తే ఖూనీ చేశామని ఒప్పుకునే వాళ్ళున్న దేశం మనది. ఆ డ్రైవర్ మీవా డేగా. డబ్బు యిచ్చి మేనేజ్ చెయ్యండి. డబ్బెవరికి చేదు. డబ్బుకు లొంగని వాడె వడు? ప్రతి మనిషికీ ఒక వెల వుంటుం దనేది నగ్న సత్యం.'' డ్కాక్టర్ మిత్ర

నవ్వాడు.

భయంతో నీరు కారిపోతున్న ఆమెకు కొంచెం ధైర్యం వచ్చింది. నదిలో కొట్టుకు పోతున్న ఆమెకు ఒక ఎండు కొమ్మ కొట్టుకొచ్చి ఆధారం దొరికినట్లు ఫీలైంది.


★★★

''కారుని నేను డ్రైవింగ్ చేసినట్లు, నేనే యాక్సిడెంట్ చేసినట్లు పోలీసుల ముందు ఒప్పుకోవాలా? బాగుందండీ మీరు చెప్పేది.'' వెటకారంగా అన్నాడు కన్నయ్య.

''అలా అనకు. నీకు డబ్బు ఇప్పిస్తాను.'' అన్నది సుకన్య.

''నా కొద్దండీ మీ డబ్బు.''

''మరేం కావాలి నీకు?'' అడిగింది సుకన్య.




కన్నయ్య కళ్ళెత్తి ఆమెను ఎగాదిగా చూశాడు. పసుపురంగు చీరలో విరగబూసిన బంతిపూల రాశిలా కనిపిస్తోంది. పోటెత్తిన యవ్వనంలా తుళ్ళిపడుతోంది. అపర రతీదేవిలా మూర్తీభవించిన స్త్రీత్వంతో తొణికిస లాడుతున్న ఆమెను చూస్తుంటే పిచ్చెక్కి పోతోంది. ఆమె నుంచి వస్తున్న వింత పరిమళం నాసికకు తగిలి వుక్కిరి బిక్కిరై పోతున్నాడు.

తనతో అవసరం ఆమెకుంది.

ఆమెతో అవసరం తనకూ వుంది.

గాలం వేసి చూద్దాం. చేప తగిలితే తగులుతుంది. లేకపోతే లేదు. అంతేగా! అనుకున్నాడు.

''మీరు కావాలి!'' నెమ్మదిగా అన్నాడు కన్నయ్య.

''వాట్..?''

సుకన్య గుండెలో నుంచి తుపాకీ గుండు దూసుకపోయినట్లయింది. ఆ రెండు మాటలు రెండు బులెట్స్‌లా ఆమె చెవులను తాకాయి. నెత్తిన పిడుగుపడి నట్లయి మెదడు మొద్దుబారిపోయింది.

కొన్ని క్షణాల తర్వాత తేరుకుని పెద్దపులిని చూసిన లేడిపిల్లలా దాదాపుగా పరిగెత్తినట్లే ఆ గది నుంచి నిష్క్రమించింది.

★★★

కన్నయ్య బెడ్ మీద పడుకుని వున్నాడు.

రాత్రి పది దాటింది.

పది నిముషాల క్రితం కరెంట్ పోయింది. గదంతా చిమ్మచీకటిగా వుంది. కొవ్వొత్తి ఎక్కడుందో తెలీలేదు. ఎవర్ని అడగాలో అర్థం కాలేదు. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది.

కన్నయ్య మనసు ఆనంద తరంగాలలో తేలిపోతున్నది. సుకన్య తన కోరిక విని చరచరా వెళ్ళిపోయింది. ఆశ నిరాశ చేసుకున్నాడు. సాయంకాలం హఠాత్తుగా వచ్చి ''అందరూ నిద్రపోయాక వస్తాననీ, గది తలుపులు తీసి వుంచమనీ'' చెప్పి హడావిడిగా వెళ్ళిపోయింది.

మాట ఇచ్చినట్లుగా సుకన్య వస్తుందా?

లేక మనసు మార్చుకుంటుందా?

కన్నయ్య మనసు వుయ్యాల లూగుతోంది.

తలుపు చప్పుడైంది.

ఆమె అడుగుల చప్పుడుతో పాటుగా డెనిమ్ వాసన, విరజాజుల పరిమళం కలగాపులగంగా కన్నయ్య ముక్కులను తాకగానే అతని మనసు వెర్రెక్కి పోయింది.

ఆమె బోల్టు వేసి వచ్చింది.

కన్నయ్య వుక్కిరిబిక్కిరైపోతున్నాడు. కలలో దేవత ఇలలో ప్రత్యక్షమై వరాలిస్తోంది. ఆమె నగ్న సౌందర్యం తనివి తీరా చూడాలని తహ తహ లాడుతున్నా పాడు కరెంటు ఇప్పుడే పోయింది. ఆమె వెళ్ళేలోపుగా కరెంటు రాకపోతుందా? అయినా స్పర్శా సుఖానికి వెలుగెందుకు?

కన్నయ్య ఒక్క వుదుటున ఆమెను తన కౌగిట్లో బంధించాడు.

★★★

మర్నాడు పోలీసు ఇనస్పెక్టర్, బ్రేక్ ఇనస్పెక్టర్ వగైరా అధికారులతో కారు తనే డ్రైవ్ చేశాడనీ, పశువుని తప్పించబోయి యాక్సిడెంట్ చేశాననీ ఒప్పుకున్నాడు కన్నయ్య.

యాక్సిడెంట్‌లో కారు తుక్కు తుక్కయినా ఇన్సూరెన్స్ సొమ్ముతో మరొక కొత్తకారు కొనుక్కోవచ్చని సంతోష పడ్డాడు సుకన్య మామగారు.

అధికారుల ముందు అబద్ధం చెప్పి కేసులలో సహాయం చేసినందుకు కన్న య్యకు కొంత డబ్బు ఇచ్చాడు రమేష్. కన్నయ్య ముందు వద్దని బెట్టు చేసినా తర్వాత తీసుకుని వెళ్ళిపోయాడు.

రమేష్ కోలుకున్నాడు.

డ్సాక్టర్ మిత్ర మందులకు గూడా డబ్బు తీసుకోలేదు.

సుకన్య సెలవు తీసుకుంటూ రాజమ్మ చేతిలో డబ్బు పెట్టింది.

''అమ్మగారూ! ఇంత డబ్బా?'' ఆశ్చర్యంగా అన్నది రాజమ్మ.

''రాజమ్మా! నువ్వు చేసిన మేలు డబ్బుతో విలువ కట్టేదికాదు. నువ్వు లేకపోతే నేనేమైపోయేదానినో?'' అంటూవుంటే సుకన్య కళ్ళల్లో నుంచి కన్నీళ్ళు జల జలా రాలాయి.

కన్నయ్య తనని కోరుతున్నాడని తెలిసి ఆవేదనతో రగిలిపోతూ గదిలో కొచ్చి వెక్కి వెక్కి ఏడుస్తుంటే రాజమ్మ రావడం, తనను ఓదార్చి ఆ పశువు కోరిక తను తీరుస్తాననీ, తను ఎటూ చెడిపోయిందేననీ, వీడి దగ్గర ఒక్కపూట పడుకుంటే కొత్తగా పోయేదేమీ లేదనీ చెప్పడం, వాడి దగ్గరకు వెళ్ళేముందు ఇంట్లో మెయిన్ ఆపి చీకట్లో సుకన్యనే అనుభవించాననే భ్రమలో వాడిని ముంచెత్తడం అన్నీ గుర్తొచ్చాయి ఆమెకు.

''నేనేం చేశానమ్మగారూ! ఈ వూళ్ళో ఎన్నో పశువులు నాకు గాయాలు చేశారు. అందులో వీడొక పశువు. అంతే గదమ్మా!'' అన్నది రాజమ్మ.

ఆమె మాటల్లో ఎంతో జీవితానుభవం ధ్వనించింది.

రాజమ్మకి ఆ వూళ్ళో విలువ లేక పోవచ్చును. ఆమె ఎటువంటిదైనా కావచ్చు కాని సుకన్య కళ్ళకు ఒక దేవతలా కనిపిస్తోంది. అడగనిదే వరాలిచ్చే దేవత.

★



## పూజా బా(త్రా)ధ

పొడుగుకాళ్ళ సుందరి పూజా బాత్రా అర్మాన్ కోహ్లీ తో సరసాలు సాగిస్తూండడం తెలిసిందే. మిగిలిన అన్ని విషయాలలో అతడు చెప్పిన మాట జవదాటని పూజాబాత్రా కొన్ని విషయాలలో మాత్రం చప్పున నోరు జారేసి వెంటనే నాలిక్కరుచుకుంటుంది. ఈమధ్య ఓ జర్నలిస్టు తమాషాగా 'మీరు ఓ ఉదయం నిద్రలేచేసరికి మీ పొడుగు తగ్గిపోయి వుందనుకోండి. ఎలా ఫీలవుతారు?' అని ప్రశ్నించాడు. అందుకు పూజా- 'నేనెంతో గర్వంగా ఫీలయ్యే నా ఎత్తు తగ్గినందుకు కొంత బాధపడతాను. కానీ అదే సమయంలో కొంత ఆనందపడతాను కూడా. ఎందుకంటే నేను పొట్టిగా మారినందువల్ల నేనెంతో ఇష్టపడే నటులు అమీర్‌ఖాన్, సల్మాన్‌ఖాన్, సైఫ్‌ఖాన్‌లతో నటించడానికి అవకాశం రావచ్చు' అంది.

-జె.వి.బాబు